క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతు పనుల కారణంగా గురువారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డీఈ హన్మంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు కరణ్‌బాగ్, జీఏ పార్క్, జీఏ కాలనీ, నియో రాయల్ స్కూల్, శ్రీనివాస కమ్యూనిటీ హాల్, పద్మావతి కల్యాణ మండపం, రామాలయం, సాయిరాం కాలనీ పరిసర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే ఉదయం 8 నుంచి 10 గంటల వరకు గడ్డిఅన్నారం మజీద్, పీఅండ్‌టీ కాలనీ, మోర్ మార్కెట్, పీఅండ్‌టీ కాలనీ దర్గా, బస్‌స్టాప్ పీటీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని డీఈ తెలిపారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో.. రూపాయల్లో..) టమోటా 17, వంకాయ 28, బెండ 32, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 35, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 15, కారెట్ 40, దొండ 18, ఆలు 20, ఉల్లి 12, గోకర 45, దోస 18, సొర 11, పొట్ల 15, అరటి 10, చిక్కుడు 55, అర్వి 35, మునగ 45, చిలగడదుంప 45, బీట్‌రూట్ 23, కీర 19, ఫ్రెంచ్ బీన్స్ 65, కాప్సికమ్ 55. ఈ ధరలు గురువారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

బోడుప్పల్‌లో సమ్మర్ క్యాంప్

బోడుప్పల్: బోడుప్పల్ ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద ఉన్న సహస్ర అకాడమీ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె.నరేష్ ఒక ప్రకటనలో వెల్లడించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు బేసిక్స్, స్పీడ్ మేథ్స్, అబాకస్, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఐఐటీ ఫౌండేషన్, 4, 5, 7, 8 తరగతి విద్యార్థులకు నవోదయ, సైనిక స్కూల్ కోచింగ్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఫోన్: 99669 23404.

నిధులు మంజూరు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని రామలింగేశ్వర కాలనీలో ప్రధాన రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని దాని స్థానంలో కొత్త రోడ్డు మంజూరు చేయాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ బుధవారం జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ జోనల్ కమిషనర్ పంకజను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. స్పందించిన జోనల్ కమిషనర్ రోడ్డు కోసం రూ. 55 లక్షల మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. వినతి ఇచ్చిన వారిలో సుధాకర్, శ్రీనివాస్ రావు ఉన్నారు.

మార్కెట్‌లో చలివేంద్రాలు ఏర్పాటు చేయండి


చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు, హమాలీలు, చాట్ కార్మికులు డిమాండ్ చేసారు. నిత్యం వేల మందితో రద్దీగా ఉండే మార్కెట్‌లో చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో దాదాపు 800 మంది కార్మికులు, హమాలీలు పనిచేస్తున్నారని ఎండలు తీవ్రత ఎక్కువగా ఉందని వెంటనే చలివేంద్రాలు ఏర్పాటుకు మార్కెట్ కమిటీ, అధికారులు చొరవ చూపాలని వారు డిమాండ్ చేశారు.

జన్మదిన వేడుక


శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నేతలు

చంపాపేట: ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగ అధ్యక్షుడు ముద్దా కళ్యాణ్ చక్రవర్తి జన్మదిన వేడుక మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు.బీఆర్‌ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయన నివాసానికి వెళ్లి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘుమారెడ్డి, సమ్‌రెడ్డి సురేందర్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, జుబేర్, సునీల్, సాయి, నాగరాజు, జయంత్, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



చైతన్యపురి: గుర్తుతెలియని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంగారెడ్డి వివరాల ప్రకారం.. శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్ సమీపంలో ఓ వృద్ధుడు అపస్మారక స్థితిలో ఉండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. 108 అంబులెన్స్‌లో ఆ వృద్ధుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

త్వరలో అందుబాటులోకి నాగోలు నూతన ఠాణా

జూన్ 2న ప్రారంభించేందుకు అధికారుల సన్నాహాలు



సీఐ వెంకటేశ్వర్లు


తాత్కాలికంగా పోలీస్ స్టేషన్ కోసం పరిశీలనలో ఉన్న బండ్లగూడ రాజీవ్ స్వగృహలోని మోడల్ హౌస్

నాగోలు: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే ఉద్దేశంతో రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీనగర్ జోన్‌లో నాగోలు నూతన పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేశారు. అప్పటికే నాగోలు నూతన పోలీస్ స్టేషన్ సీఐ వెంకటేశ్వర్లు, ఇతర ఎస్‌ఐలను కేటాయించారు. నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటు కోసం పోలీస్ అధికారులు పరిశీలిస్తున్నారు. నూతన పోలీస్ స్టేషన్ కోసం 55 మంది సిబ్బందిని నియమిస్తున్నాన్నట్లు డీసీపీ సాయిశ్రీ తెలిపారు. ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండే కాలనీ, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండే కాలనీ కలిపి నాగోలు పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. నగర శివారు ప్రాంతంలో పెరుగుతున్న నేరాల దృష్టిలో పెట్టుకొని నాగోలు నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు నూతన పోలీస్ స్టేషన్ కలిపేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట..

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నాగోలు నూతన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా బండ్లగూడలోని రాజీవ్ స్వగృహలోని మోడల్ హౌస్‌ను పరిశీలించారు. తట్టి అన్నారంలో వార్డు కార్యాలయాన్ని సైతం పరిశీలించినట్లు ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ తెలిపారు. ప్రస్తుతం తాత్కాలికంగా ప్రారంభించి అనంతరం పూర్తిస్థాయి బిల్డింగ్ నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కొత్త పోలీస్ స్టేషన్ ఏర్పాటుతో శివారు ప్రాంతాల్లో జరిగే అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని డీసీపీ తెలిపారు.

నాగోలు స్టేషన్ పరిధిలో వచ్చే కాలనీలు..

నాగోలు మూసీ చౌరస్తా నుంచి ప్రారంభమై నాగోలు ఓల్డ్ విలేజ్, మమతానగర్ కాలనీ, న్యూ మమతానగర్ కాలనీ, ఎస్ వీరాస్ టవర్స్, వెంకటరమణ కాలనీ, వెంకట్‌రెడ్డినగర్, సాయినగర్ నగర్ కాలనీ, నువ్వలబండ, అరుణోదయ కాలనీ, మల్లికార్జున హిల్స్, లక్ష్మినర్సింహకాలనీ, బ్లేడ్స్‌కాలనీ, జైపురికాలనీ, ఫతుళ్ళగూడ, శ్రీనివాస్‌నగర్ కాలనీ, సర్వేనెంబర్ 58, విజయగార్డెన్, అజయ్‌నగర్‌కాలనీ, కృషినగర్, ఆనంద్‌నగర్, మధురనగర్, ధనలక్ష్మీ కాలనీ, రాజీవ్ స్వగృహ, జీఎస్ఐ, ఆప్కో కాలనీ, ఈశ్వరిపురికాలనీ, డీఆర్‌ఎస్ సెంటర్, మత్తుగూడ, తట్టిఅన్నారం, జీవీఆర్ కాలనీ, జే కన్వెన్షన్, హిందూ అరణ్య, వనస్థలి హిల్స్, మన్త్రిపల్లి, ఆర్‌కేనగర్, లక్ష్మీ గణపతి నగర్, ఏపీహెచ్‌బీ కాలనీ, మనుమాన్ నగర్ కాలనీ, తిమ్మాయిగూడ, రాజీవ్ గృహకల్ప, గౌరెల్లి లీడింగ్ టూ ఓఆర్ఆర్ వరకు గుర్తించి ఏర్పాట్లు చేశారు.

థియేటర్ లావాదేవీల విషయంలో గొడవ

కోర్టు ఆదేశాలతో పలువురిపై కేసు


మాట్లాడుతున్న సామ జంగారెడ్డి, మధుకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురం రైతు బజారు సమీపంలోని సంపూర్ణ థియేటర్ లావాదేవీల విషయంలో పార్ట్‌నర్స్ అయిన తమను థియేటర్ నిర్వాహకులు సామ రంగారెడ్డి, సామ ప్రభాకర్‌రెడ్డి మోసం చేస్తున్నారని, ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరుతూ సామ జంగారెడ్డి పోలీసులను కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కుమారులు మధుకర్‌రెడ్డి, మహేశ్వర్ రెడ్డిలతో కలిసి మాట్లాడారు. సంపూర్ణ థియేటర్‌లో పలువురు భాగస్వాములు ఉండగా అందులో తమకు 15 శాతం వాటా ఉందని, థియేటర్‌కు సంబంధించి ఏషియన్ వారి నుంచి వారానికి రెండు లక్షల రూపాయల లీజ్ వస్తుంటే తమకు సరైన లెక్కలు చూపించకుండా సామ రంగారెడ్డి, ప్రభాకర్ రెడ్డి మోసానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని, దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించగా వారి ఆదేశాల మేరకు పోలీసులు సామ రంగారెడ్డి, సామ ప్రభాకర్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారని అన్నారు.

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు



మన్సూరాబాద్: డివిజన్‌లో డ్రైనేజీలు పొంగకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధి హయత్‌నగర్‌లోని వినాయకనగర్‌కాలనీలో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ మురుగు రోడ్లపై పారుతుందని కాలనీవాసుల ఫిర్యాదు మేరకు బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గత కొన్ని రోజులుగా వినాయక్‌నగర్ కాలనీవాసులు డ్రైనేజీ సమస్యతో అవస్థలు పడుతున్నారని, మ్యాన్‌హోళ్ల ఎత్తు పెంచి మ్యాన్‌హోళ్లలో ఉన్న చెత్తను తొలగింపజేసి తాత్కాలిక చర్యలు చేపట్టినట్లు వివరించారు. కొన్ని సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పైపులైన్ కావడంతో నేటి అవసరాలకు అనుగుణంగా లేదని డ్రైనేజీ పైపులైన్ ఆధునీకరణకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెట్ట మహేశ్వర్, సుధాకర్‌రెడ్డి, కృష్ణాగౌడ్, రాము, ప్రభాకర్‌రెడ్డి, కదారి యాదగిరియాదవ్, పాతూరి శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తాం


జలమండలి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: నియోజకవర్గంలోని శివారు కాలనీలలో ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన జలమండలి అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు అవసరం ఉన్న చిన్న చిన్న వాటర్ పైప్‌లైన్లు వెంటనే ఏర్పాటు చేయాలని ఎక్కడ కూడా కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. నీటి, డ్రైనేజీ పైప్‌లైన్లు పక్కపక్కనే ఉండడం వలన నీరు కలుషితం అవుతుందని వెంటనే వాటిని గుర్తించి వేర్వేరుగా ఏర్పాటు చేయాలని సూచించారు. పైప్‌లైన్ల కోసం ప్రణాళిక సిద్ధం చేసి నివేదిక తయారు చేయాలని సూచించారు. గత వర్షాకాలంలో పలు కాలనీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ధ్వంసం అయిందని వెంటనే వాటికి మరమ్మతులు చేపట్టాలని అన్నారు.

డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు


కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

లింగోజిగూడ: కాలనీలలో డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని ఆర్టీసీ మజ్దూర్ కాలనీ, సిద్ధి వినాయక కాలనీలో బుధవారం వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి పర్యటిస్తూ మాట్లాడారు. అభివృద్ధి పనులలో నాణ్యత విషయంలో రాజీ పడవద్దని తెలిపారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి సిద్ధి వినాయక కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు, బాలు నాయక్, సూర్య, నాగేశ్వరరావు, నాని, బాబు, వెంకటేశ్వరరావు, ఆదిరెడ్డి, చంద్రశేఖర్, నర్సింగ్‌రావు, నరసింహచారి, కిషన్, మూర్తి పాల్గొన్నారు.

'దశాబ్ది ఉత్సవాల్లో వికలాంగుల అంశాన్ని చేర్చండి'

చాదర్‌ఘాట్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో వికలాంగుల అంశాన్ని చేర్చి వికలాంగులకు గుర్తింపు ఇవ్వాలని రాష్ట్ర వికలాంగుల సంఘం నాయకుడు నల్గొండ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల్లో వికలాంగుల అంశాన్ని చేర్చకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు తగదన్నారు. వికలాంగులలో ఉద్యోగులు, విద్యావంతులు, ఎస్‌జీఓ ఉన్నారని, వారిని గుర్తుపెట్టుకొని దశాబ్ది ఉత్సవాల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వికలాంగుల సంఘం నాయకులు చెరుకు నాగభూషణం, నారా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నియామకం


బొజ్జ వెంకట్‌రెడ్డి

చైతన్యపురి: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రొటోకాల్ కమిటీ కార్యదర్శిగా చైతన్యపురి డివిజన్‌కు చెందిన బొజ్జ వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. యూత్ కాంగ్రెస్‌లో చురుకైన నేతగా వ్యవహరించిన వెంకట్‌రెడ్డి ఎల్‌బీనగర్ టౌన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, డివిజన్ అధ్యక్షుడిగా కూడా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపై వచ్చి సమష్టిగా పనిచేస్తే కాంగ్రెస్ గెలుపు ఖాయం అన్నారు.

మన్నాన్‌పల్లి చౌరస్తాకు యాదయ్య పేరు పెట్టండి

ఎంపీడీఓకు టీడీపీ నాయకుల వినతి

మహేశ్వరం: మన్నాన్‌పల్లి చౌరస్తాకు తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ టీడీపీ నాయకులు బుధవారం ఎంపీడీఓ నర్సింహకు వినతిపత్రం అందజేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు పల్మాటి నరేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లవుతున్నా అమరవీరుడు యాదయ్య కుటుంబానికి న్యాయం జరగలేదని.. మన్నాన్‌పల్లి చౌరస్తాకు యాదయ్య పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మండలంలోని ఉద్యమకారులు, అన్ని రాజకీయ పార్టీలు ఈ అంశంపై తెలుగుదేశం పార్టీతో కలిసిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిప్పశెట్టి మల్లేష్, సత్యనారాయణ, చంద్రునాయక్‌లు పాల్గొన్నారు.

30 నుంచి బ్రహ్మోత్సవ వేడుకలు

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబదేవి 17వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 30 నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు శ్రీమాతా నిమిషాంబదేవి ఆలయం, గణపతి, శివాలయం, శ్రీరామపరివార, ఆంజనేయ, దత్తాత్రేయ, సాయిబాబా, నవగ్రహ, సర్ప ఉపాలయాల బ్రహ్మోత్సవాల వేడుకలు జరుగుతాయన్నారు. ఈ నెల 30వ తేదీన సుప్రభాతం, దేవతా ప్రార్థన, గోపూజ, శాంతి మంత్ర పఠనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపస్థాపన, అగ్నిస్థాపన జరుగుతుందన్నారు. అలాగే 31వ తేదీన గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండప దేవతాపూజలు, శ్రీచక్రార్చన, మండప ఆరాధన, గురువుగారిచే ప్రవచనం, మంత్ర పుష్పం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అలాగే జూన్ 1వ తేదీన గణపతి పూజ, ఆవాహిత దేవత హోమం, బలిప్రధానం, పూర్ణాహుతి, ఉదయం 9గంటలకు అమ్మవారికి పంచామృత, 56 రకాల పండ్ల రసాలతో సుగంధ ద్రవ్యాలతో నిజాభిషేకం, విశేష అలంకరణ, పంచ హారతులు, రుత్విక్ సన్మానం, పల్లకీ సేవ, సామూహిక ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

చిలుకానగర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి



వినతి పత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికి మరిన్ని నిధులను కేటాయించాలని కోరుతూ బుధవారం చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈస్ట్ కళ్యాణపురి కమ్యూనిటీ హాల్ పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు సీతారామ కాలనీలో వరద నీటి పైపులైన్ పనులకు తవ్విన రోడ్ల మరమ్మతులు, కుమ్మరి సంఘం శ్మశానవాటికలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులను మంజూరు చేయాల్సిందిగా కోరారు. జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, నారాయణరెడ్డి, ఎండీ మహ్మమూద్, షఫీ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.5లక్షల ఎల్‌ఓసీ అందజేత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్‌లోని కమ్మగూడకు చెందిన షర్మిల ఇటీవల ఓ ప్రమాదంలో కాలు పోగొట్టుకుంది. స్థానిక నేతల ద్వారా విషయం తెలుసుకున్న మంత్రి సబితారెడ్డి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.1.50 లక్షల ఎల్‌ఓసీ చెక్కును బుధవారం బాధిత మహిళకు అందజేశారు. ఇంకా అవసరమైతే తన సొంత నిధుల నుంచి అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు జంగయ్య, మాజీ కౌన్సిలర్ యాదగిరి, నాయకులు జంగారెడ్డి, విజయ్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నాగోలు: కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా ముకుందరావు, ప్రభు, కొండయ్య, అధ్యక్షుడిగా బంగారు రావు, ఉపాధ్యక్షుడిగా సుధాకర్‌శర్మ, వరప్రసాదరావు, నిర్మలమ్మ, ప్రధాన కార్యదర్శిగా ముత్యాలప్ప, జాయింట్ సెక్రటరీ రాజేశ్వర్‌గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా రామదాస్, రంగారావు, కోశాధికారి కందిబండ శేఖర్, సభ్యులుగా జనార్దన్‌రెడ్డి, గోపాలకిషన్‌రావు, లింగయ్య, కుమార స్వామి, బాబురావు, లలితమ్మను ఎన్నుకున్నారు.

వైభవంగా బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని ఇమామ్‌గూడలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం వైభవంగా సాగింది. అనంతరం మహా కుంభాభిషేకం, శాంతి పూజలు, మహా నివేదన మంగళహారతి తదితర కార్యక్రమాలు చేశారు. భక్తులు, బీఆర్‌ఎస్ యువజన నాయకుడు కార్తీక్‌రెడ్డి బొడ్రాయిని దర్శించుకున్నారు.

ఒకే ఓటు నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్
- మహేశ్వరం నియోజకవర్గ ఓటరు సర్వే
- ఎన్నికల నిర్వహణపై సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ సూరజ్‌కుమార్

మీర్‌పేట: మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ సర్వే, ఎన్నికల నిర్వహణకు సంబంధించి బుధవారం మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్‌ఓలు సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్ హాజరై మాట్లాడారు. బీఎల్‌ఓలు స్థానిక రాజకీయ నాయకులతో సమన్వయం చేసుకుని ఇంటింట ఓటరు సర్వే చేసి, ఒక వ్యక్తికి ఒకే ఓటు అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మరణించిన వారి ధ్రువీకరణ పత్రం తీసుకొని జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. అదే విధంగా ఒకే ఇంటి నంబర్‌పై 6 లేదా అంతకంటే ఎక్కువ ఓటర్లు ఉంటే వాళ్ల జాబితాను పునః పరిశీలించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓ ఎన్నికల అధికారిగా రానున్న ఎన్నికలు సజావుగా జరిగేందుకు తోడ్పడాలని ఆర్‌డీఓ విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఓటర్ రీ వెరిఫికేషన్ జరుగుతున్న విధానం గురించి ఆర్‌డీఓ రాజకీయ పార్టీల నాయకులకు వివరించారు. దీంతో పాటు నాయకులు ఇచ్చిన సలహాలు, సూచనలను స్వీకరించి తగు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. బాలాపూర్ మండల తహసీల్దార్ జనార్దన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఆదిత్య, మేయర్ ఎం దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, రాజకీయ పార్టీల నాయకులు పీ జంగయ్యగౌడ్, పీ నర్సింహ, జీ శ్రీనివాస్, డీ భూపేష్‌గౌడ్, కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఎన్నికల అధికారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మానవ తప్పిదాల వల్లే ప్రకృతి వైపరీత్యాలు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మీర్‌పేట: భారతీయ సంస్కృతి అతి పురాతనమైనదని, నా దేశం.. నా సంస్కృతి అనే భావన నేటి తరం పిల్లల్లో కలిగించాలని సిల్వర్ డ్రాప్స్ పాఠశాలల చైర్మన్ శ్రీనివాసరావు తల్లిదండ్రులకు సూచించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో జిల్లెలగూడ సిల్వర్ డ్రాప్స్ పాఠశాలలో 10రోజుల పాటు జరిగిన వేసవి శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ముఖ్యఅతిథులుగా శ్రీనివాసరావు, ప్రముఖ ప్రవచన కర్త వేముల రాజేశ్వరరావు హాజరై మాట్లాడారు. మానవ తప్పిదాల వల్లే ప్రకృతి వైపరీత్యాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఏది మంచి, ఏది చెడు అని గ్రహించే జ్ఞానం మనిషికి మాత్రమే ఉంటుందన్నారు. మంచి గుణాలు ఉన్నవాడే మానవుడు అవుతాడని అన్నారు. విద్య అనేది పిల్లలకు మనం ఇచ్చే అతి పెద్ద ఆస్తి అని పేర్కొన్నారు. భగవద్గీతను ప్రతి ఒక్క విద్యార్థి నేర్చుకోవాలని సూచించారు. అనంతరం నిర్వాహకులు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. శిక్షణ తరగతుల్లో పిల్లలకు ఆటపాటలు, శ్లోకాలు, భజనలు, కీర్తనలు, యోగా, విద్యతో పాటు విలువలతో కూడిన విషయాలను నేర్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి జోనల్ బాధ్యులు అహల్య, విద్యుత్ శాఖ అధికారి రమణ, అప్పం రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

'ఫ్రీడమ్'గా తాగేస్తున్నారు!

- శ్మశానవాటికనూ వదలని మందుబాబులు
- ఉదయం మొదలుకొని అర్ధరాత్రి వరకు అక్కడే..
- గొడవలకు దిగుతున్న ఆకతాయిలు
- ఇళ్ల మధ్య ఉండడమే కారణం.. పట్టించుకోని అధికారులు



బడంగ్‌పేట్: పట్టణంలోని ఫ్రీడమ్ ఏకో పార్కు(శ్మశానవాటిక) మందుబాబులకు అడ్డాగా మారింది. గ్రామం మధ్యలో శ్మశానవాటిక ఉండడం ఆకతాయిలకు కలిసొచ్చింది. రెండు ఎకరాల్లో ఉన్న ఈ ఫ్రీడం ఏకో పార్కును హరితహారంలో భాగంగా అభివృద్ధి చేశారు. సమాధులు లేని ప్రాంతాల్లో మొక్కలు నాటారు. అయితే వాటి ఆలనాపాలనా చూసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మించారు. పెద్ద స్వాగత బోర్డు కూడా ఏర్పాటు చేశారు. ఈ పార్కు చుట్టూ టెలిఫోన్, సుబ్రహ్మణ్యం కాలనీతోపాటు మరి కొన్ని బస్తీలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోని ఆకతాయిలు తెల్లవారింది మొదలు అర్ధరాత్రి వరకు ఇక్కడే మద్యం తాగుతున్నారు. మద్యం మత్తులో కాలనీ వాసులపై గొడవలకు దిగుతున్నారు. అంతే కాకుండా మద్యం తాగి అక్కడే బాటిళ్లు, చెత్తాచెదారం పడేస్తున్నారు. దీంతో శ్మశానవాటికి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, స్థానిక పోలీసులు మందుబాబులు ఏకో ఫ్రీడం పార్కులోకి రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

మందుబాబులను కట్టడి చేయాలి



పట్టణంలోని ఫ్రీడం ఏకో పార్కు మందుబాబులకు అడ్డాగా మారింది. కాలనీల మధ్య శ్మశానవాటిక ఉండడంతో ఆకతాయిలు ప్రహరీ దూకి అందులో మద్యం తాగుతున్నారు. మున్సిపల్ అధికారులు, మీర్‌పేట పోలీసులు నిఘా ఉంచి మందుబాబులను కట్టడి చేయాలి. – బంగారు బాబు, టెలిఫోన్ కాలనీ అధ్యక్షుడు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9912220363
9505507616 9912220365